క్లుప్తంగా

గర్భిణులకు స్కానింగ్



స్కానింగ్ పరీక్షలకు పేర్లు నమోదు చేసుకుంటున్న వైద్య సిబ్బంది

ఎమ్మిగనూరురూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో సోమవారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ కార్యక్రమంలో భాగంగా ఎమ్మిగనూరు, మంత్రాలయం, నందవరం, పెద్దకడుబూరు, కోసిగి మండలాలకు చెందిన 240 మంది గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు చేసినట్లు సూపరిండెంట్ డాక్టరు సుధా చెప్పారు. గైనకాలజిస్ట్ డాక్టర్లు సుజిత, ఫాతిమా వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులకు మార్నింగ్ ఫన్నీ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

ఆరోగ్యంగా ఉంటేనే వాహనాలు నడపాలి



ఆర్టీఓ నాగేంద్రకు కంటి పరీక్ష చేస్తున్న వైద్యసిబ్బంది

ఆదోని అర్బన్: ఆరోగ్యంగా ఉంటేనే రోడ్డుపై వాహనం నడపాలని, లేకపోతే ప్రమాదాలు చోటు చేసుకుంటాయని ఆర్టీఓ నాగేంద్ర, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సిసిరాదీప్తి అన్నారు. సోమవారం స్థానిక ఆర్టీఓ కార్యాలయ ఆవరణలో రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా వాహనదారులకు మదర్‌థెరిస్సా ఇంటిగ్రిటీ నేషనల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో కంటి వైద్య, ఈసీజీ, బీపీ, షుగర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆర్టీఓ, ఎంవీఐ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు కంటి పరీక్షలు అప్పుడప్పుడు చేయించుకోవాలని సూచించారు. అదేవిధంగా ఆరోగ్య పరీక్షలు కూడా చేసుకోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ కనకప్ప తాత మఠం పీఠాధిపతి మృతి

కౌతాళం : మండల పరిధిలోని ఉప్పరహాల్ గ్రామంలో శ్రీ కనకప్ప తాత మఠం పీఠాధిపతి శ్రీ చంద్రశేఖర్ స్వామి (70) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి తరుపున వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి గ్రామానికి చేరుకుని భౌతికాయానికి పూలమాలలు వేసి సంతాపం తెలిపారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి ఏకామి రెడ్డి ఉన్నారు.

రోగులకు సమస్యలు లేకుండా చూసుకోండి



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ శ్రీవిద్య

పెద్దకడబూరు : ఆస్పత్రికి వస్తున్న రోగులకు ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ అధ్యక్షురాలు, ఎంపీపీ శ్రీవిద్య సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ముందుగా ఆస్పత్రి, ఆస్పత్రి ఆవరణను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఆస్పత్రిలో రోగులు ఇబ్బందులు పడకుండా విద్యుత్ కనెక్షన్, ఫ్యాన్‌లు, తాగునీటి సమస్య పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, సర్పంచ్ రామాంజినేయులు, ఎంపీడీఓ నాగరాజుస్వామి, తహసీల్దారు శ్రీనాథ్, డాక్టర్ ఫిరదౌస్ పాల్గొన్నారు.

నిర్విరామంగా పంచాక్షరీ మంత్రం

పెద్దకడబూరు: 13 గంటలకు పైగా నిర్విరామంగా 1,16,640 సార్లు శివ పంచాక్షరీ మంత్రం (ఓం నమః శివాయ) పఠించి తన భక్తిని చాటుకున్నాడు ఓ భక్తుడు. మండల కేంద్రానికి చెందిన సాలె నాగరాజు గత కొన్ని సంవత్సరాలుగా శివ మాల ధరిస్తున్నాడు. గ్రామంలో శివమాల, అయ్యప్ప మాలధారులకు గురుస్వామిగా ఉంటున్నాడు. ఆయన గత 4 సంవత్సరాలుగా 14 గంటల పాటు పంచాక్షరీ మంత్రం పఠిస్తున్నాడు. సోమవారం ఉదయం 6.25గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు పఠనం సాగింది.

ఇల్లు అమ్మేశారన్న బాధతో ..

ఆదోని అర్బన్: అప్పులు ఎక్కువ కావడంతో తల్లిదండ్రులు ఇల్లు అమ్మేయడంతో మనస్తాపానికి గురైన పట్టణంలోని వాల్మీకినగర్‌కు చెందిన రాజశేఖర్‌రెడ్డి(28) సోమవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వాల్మీకినగర్‌కు చెందిన రాముడు, మునీంద్రమ్మలకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. ఇద్దరు కుమార్తెలకు తల్లిదండ్రులు అప్పు చేసి పెళ్లి చేశారు. అప్పులు ఎక్కువ కావడంతో ఇల్లు అమ్మేసి అప్పులన్నీ తీర్చారు. దీంతో చివరి కుమారుడు రాజశేఖర్ ఇల్లు వదలివెళ్లాలనే బాధను తట్టుకోలేక ఇంట్లో ఎవరూ లేనప్పుడు ఉరేసుకు న్నాడు. మృతుడి తండ్రి రాముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ రామస్వామి తెలిపారు.

బడికెళ్లాల్సిన వయస్సులో బాల్యవివాహాలు

- చిన్నవయస్సు వివాహాల్లో రాష్ట్రంలో మూడో స్థానం
- జిల్లాలోని పశ్చిమ ప్రాతంలోనే ఎక్కువ
- పేదరికం, అవగాహనా రాహిత్యమే ప్రధాన కారణం
- ఫలితాలివ్వని ఐసీడీఎస్ అవగాహన కార్యక్రమాలు



బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డా. సత్యవతి (ఫైల్)

కమిటీలను ఏర్పాటు చేస్తున్నాం

బాల్య వివాహాలను నియంత్రించేందుకు కమిటీలను ఏర్పాటు చేస్తున్నాం. ముఖ్యంగా ఈ కమిటీలు గ్రామాల్లో బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తాయి. చిన్న వయస్సులో పెళ్లి చేయడం వలన జరిగే అనర్థాలు, నష్టాలను ప్రజలకు వివరిస్తారు. ఎక్కడైన వివాహం నిశ్చయం అయితే వారికి కౌన్సిలింగ్ నిర్వహించి నిలిపివేయడానికి చర్యలు తీసుకుంటాం. ఈ విషయం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకొని ప్రజలకు అవగాహన కల్పిస్తే బాల్య వివాహాలను నియంత్రించవచ్చు.
– ఉమామహేశ్వరమ్మ సీడీపీఓ

ఆదోని సెంట్రల్: పుస్తకాలు పట్టుకొని బడికెళ్లాల్సిన ఆడపిల్లలకు బాల్యంలోనే వివాహాలు చేస్తున్నారు. పేదరికం, బాధ్యత తీరిపోతుందనే ఉద్దేశంతో తల్లిదండ్రులు సంసారం అనే సాగరంలోకి నెట్టేస్తున్నారు. బాల్య వివాహాలు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో వెనుకబడిన వర్గాలు, పేద కుటుంబాల్లోనే జరుగుతున్నాయి. అందులోనూ వెనుకబడిన జిల్లా పశ్చిమ ప్రాంతంలో మరింత ఎక్కువగా ఉన్నాయి. తెలిసీతెలియని వయస్సులో గర్భం దాల్చి అనారోగ్య సమస్యలను కొని తెచ్చుకుంటున్నారు. వీటి నివారణకు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నా.. అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నా బాల్యవివాహాలు ఆగడంలేదు.

బాల్యవివాహాల్లో మూడో స్థానం

బాల్య వివాహాలలో ఉమ్మడి కర్నూలు జిల్లా రాష్ట్రంలో మూడో స్థానంలో ఉంది. జిల్లాలో 2023–24 సంవత్సరాల్లో 61 బాల్యవివాహాలు జరగగా, 64 వివాహాలను అడ్డుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇవి అధికారుల దృష్టికి వచ్చినవి మాత్రమే, ఇంకా లెక్కలోకి రాని బాల్యవిహాలు ఎక్కువగానే ఉంటాయంటున్నారు. 15 నుంచి 18 ఏళ్ల వయస్సు కలిగిన వారు 4.97 శాతం మంది తల్లులు అవుతున్నట్లు సర్వేలు చెబుతున్నట్లు వెల్లడించారు. దీనికి కారణం తల్లిదండ్రులు నిరక్షరాస్యులవడమే. ఆడపిల్లలకు పెళ్లి చేస్తే భారం దిగిపోతుందనే భవనలో పిల్లలకు చిన్న వయస్సులోనే చేస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో ఎక్కువగా బాల్యవివాహాలు జరుగుతున్నాయి. హాలహర్వి, కౌలాళం, హోళగుంద, కోసిగి, మంత్రాలయం, ఆలూరు, ఎమ్మిగనూరు. ఆస్పరి, చిప్పగిరి మండలాలతో పాటు పలు మండలాల్లో బాల్య వివాహాలు ఎక్కువగా చేస్తున్నారు.

అనారోగ్య సమస్యలు

తెలసీతెలియని వయస్సులో వివాహం చేయడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయి. అమ్మాయి శారీరకంగా ,మానసికంగా దృఢంగా లేక పోవడంతో ఒక్కోసారి ప్రాణాలకే ముప్పు ఏర్పడే ప్రమాదం ఉంది. పుట్టబోయే పిల్లలు కూడా ఆరోగ్యంగా ఎదగక పోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. బాల్యవివహాలు జరిగిన వారిలో మహిళలు, పిల్లలు చాలమంది రక్తహీనతతో బాధ పడుతున్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

వాస్తవానికి అమ్మాయికి 18, అబ్బాయికి 21 ఏళ్లు నిండిన తర్వాతే పెళ్లి చేయలని ప్రభుత్వ నిబంధనలు ఉన్నాయి. అయితే పట్టుమని 15ఎళ్లు కూడా నిండని ఆడపిల్లలు తల్లులు అవుతున్నట్లు సర్వేలు చెపుతున్నాయి. దీనివలన జరిగే అనర్థాలను ప్రజలకు వివరించాలి. బాల్య వివాహాల వలన జరిగే నష్టాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించి వాటిని నియంత్రించేందుకు అవగాహన కార్యక్రమాలను విస్తృతం చేయాల్సిన అవసరం ఉందని ప్రజాసంఘాల నాయకులు చెబుతున్నారు. అయితే ఏదో మొక్కుబడిగా, తూతు మంత్రంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇంటింటా ప్రచారం నిర్వహించి బాల్య వివాహాల వలన ఆడపిల్లలకు జరిగే అనర్థాలను ప్రజలకు వివరించి నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు పేర్కొంటున్నారు.

తూతూమంత్రంగా అవగాహన కార్యక్రమాలు..

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ఆదోని సెంట్రల్: విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు కార్యదర్శి అబ్దుల్లా తెలిపారు. సోమవారం ఎస్ఎఫ్ఐ పట్టణ మహా సభల సందర్భంగా పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడిగా శశిధర్, కార్యదర్శిగా గౌస్, పట్టణ ఉపాధ్యక్షులుగా సురేంద్ర, నాగరాజు, సహాయ కార్యదర్శులుగా వెంకట్, చిరు, ఉమాకాంత్ తదితరులు ఎన్నికయ్యారు.

నారాయణ కాలేజీపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా ప్రాక్టికల్స్‌కు డబ్బు వసూలు చేస్తున్న నారాయణ కాలేజీపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రాము, విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పాత తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో తహసీల్దార్ శేషఫణికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ డబ్బులు ఇవ్వని విద్యార్థులకు రికార్డ్స్‌లో మార్కులు తక్కువ వేస్తామని బెదిరింపులకు గురిచేస్తున్నారని చెప్పారు. నాయకులు అశోక్, సాయి, వినోద్ తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే పీజీఆర్ఎస్



సమస్యలు వింటున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం – పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం-పీజీఆర్ఎస్ నిర్వహించి డివిజన్‌లోని ఆయా మండలాల ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరిచేలా చూడాలని ఆదేశించారు. మండలంలోని ఆయాశాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వేయర్స్ శ్రీనివాసరావు, వేణుసూర్య, డీఎల్‌పీఓ నూర్జహాన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చేతన్‌ప్రియ, ఆర్అండ్‌బీ డిప్యూటీ ఇంజినీర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



మిఠాయి ఫ్యాక్టరీని తరలించాలని కమిషనర్‌ను కోరుతున్న మహిళలు, వీధి ప్రజలు

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ తెలిపారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. బీఎస్ టాకీస్ ఏరియాలో మిఠాయి ఫ్యాక్టరీ వల్ల వాసన, పొగ, దుర్వాసన, ధూళి విడుదలవుతుందని, దీంతో తాము అనారోగ్యానికి గురవుతున్నామని స్థానిక మహిళలు మహేశ్వరి, భారతి, నందిని, మల్లికార్జున, ఇషాక్, చంద్రకాంత్, ప్రవీణ్ తదితరులు కమిషనర్ ఎం.కృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఫ్యాక్టరీని మరోచోటుకు తరలించి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని కోరారు. ప్రజారోగ్యానికి హానీ కలిగించే ఫ్యాక్టరీపై విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామని కమిషనర్ సమాధానంగా చెప్పారు. మున్సిపాలిటీలో తడి-పొడి చెత్తను ఎత్తివేసే ట్రక్కుల డ్రైవర్లకు రావాల్సిన జీతభత్యాలు, ఈఎస్ఐ, పీఎఫ్ ఇవ్వాలని కోరుతూ డ్రైవర్లు కమిషనర్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు.

పార్టీ కోసం సమష్టిగా పని చేద్దాం



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ డి.నజీర్ అహమ్మద్

ఎమ్మిగనూరు టౌన్: వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసేందుకు అందరం సమష్టిగా పని చేద్దామని మున్సిపల్ వైస్ చైర్మన్ డి.నజీర్ అహమ్మద్, చేనేత జిల్లా అధ్యక్షుడు శివ ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేశప్ప పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని 9, 10వ వార్డులలో కౌన్సిలర్లు రాజారత్నం, సుధాకర్‌ల అధ్యక్షతన పార్టీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీతోనే అన్ని వర్గాల వారికీ లబ్ధి చేకూరిందని, అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి యూకే రాజశేఖర్, గౌస్, చిన్న ఫక్రుద్దీన్, నిరంజన్, సలీం, మక్బుల్, అల్లబకాష్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధరూఢ స్వామి ఉత్సవాలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేసి వార్షికోత్సవాలను ప్రారంభిస్తున్న మహాస్వాములు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని రైల్వే గేటు సమీపంలో సద్గురు ఆరూఢ జ్యోతి శాంతాశ్రమంలో వెలసిన సిద్ధరూఢ స్వామి ఆలయ తొమ్మిదో వారికోత్సవ వేడుకలు ప్రారంభమైయ్యాయి. సోమవారం వేకువ జామున నుంచి స్వామి వారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, ఫలపుష్పాలంకరణ, వెండి కవచ అలంకరణలు గావించి మహా మంగళ హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు. మొదటి రోజున కర్ణాటక రాష్ట్రం గూళ్యం ఉమామహేశ్వర ఆశ్రమ పీఠాధిపతి, సద్గురు ప్రణావనందగిరి స్వామి, హిప్పరగి ఆరూఢ బసవాశ్రమ పీఠాధిపతి సద్గురు సిద్ధరూఢ స్వామి శరణరు, భాగేపల్లి గీతాశ్రమ పీఠాధిపతి సద్గురు శివానంద స్వామిలు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం ఉపన్యాసం కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవరచుకోవాలని, అప్పుడే మానసిక ప్రశాంతత కలుగుతోందన్నారు. సిద్ధరూఢ స్వామి ప్రత్యేకత గురించి భక్తులకు వివరించారు. ఈనెల 12వ తేదీన స్వామి రథోత్సవ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు .

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



సామూహిక వివాహ వేడుకల్లో నూతన దంపతులతో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్ రెడ్డి

కౌతాళం: మండల కేంద్రం కౌతాళంలో పార్వతీ సమేత శ్రీ త్రయంబకేశ్వర స్వామి దేవాలయ మొదటి వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం ఆలయం ప్రాంగణంలో వార్షికోత్సవం, బసవపురాణం ముగింపులో భాగంగా ఉచిత సామూహిక వివాహాలు జరిపించారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసుకున్నారు. నూతన వధూవరులకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ప్రహ్లాదాచార్, వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి, సోమిరెడ్డి, మల్లికార్జున, చంద్రయ్య స్వామి, పాల్ దినకర్ అవతారం తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్లంలో పట్టుసాధిస్తే సులభంగా ఉద్యోగాలు

ఎమ్మిగనూరురూరల్: ఆంగ్లంలో పట్టు సాధిస్తే ఉద్యోగం సంపాదించడం చాల సులభమని ఎస్ఆర్ఐటీ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ అనిల్‌కుమార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో ఏ-1 డిపార్ట్ మెంట్ ఆధ్వర్యంలో ఎంప్లాయి ఎబిలిటీ స్కిల్, పొంటెన్షియల్ కెరియర్, అపార్చునిటీస్ అనే అంశాలపై బీటెక్ మూడవ సంవత్సరం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా.సుధాకర్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

నర్సింగ్ హోంపై చర్యలు తీసుకోండి

ఎమ్మిగనూరురూరల్ /ఎమ్మిగనూరు టౌన్: పట్టణంలో వైద్యం పేరుతో వ్యాపారం చేస్తున్న రేఖా నర్సింగ్ హోంపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు శేఖర్, మహేంద్రబాబు, ఉదయ్ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ శేషఫణికి విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వినతి పత్రం అందచేశారు. వారు మాట్లాడుతూ వైద్యం కోసం నర్సింగ్ హోంకు వచ్చే వారికి ఎటువంటి వసతులు కల్పించకుండా ధనార్జనే ధ్యేయంగా బిల్లులు వసూలు చేస్తున్నారని చెప్పారు. నాయకులతో పాటు అశోక్, ప్రేమ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నందవరం: ఇసుక అక్రమ రవాణపై సోమవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు నాగలదిన్నె గ్రామంలోని తుంగభద్ర నదిలో దాడులు నిర్వహించారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఆలువాల గ్రామానికి చెందిన ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్‌ను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. రికార్డులు పరిశీలించి జరిమానా విధిస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

దళిత శ్మశాన వాటికకు రక్షణ కల్పించండి

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని దళిత శ్మశాన వాటికకు రక్షణ కల్పించాలని ఐపీవైఎల్ జిల్లా కార్యదర్శి చిన్నప్రసాద్ కోరారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి వినతి పత్రం అందచేశారు. ఆయన మాట్లాడుతూ దళితులకు స్మశాన వాటికకు 8 ఎకరాలు స్థలం ఇచ్చి దాని చుట్టూ ప్రహరీని ఏర్పాటు చేశారని చెప్పారు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు గోడను, బోరును ధ్వంసం చేసి వెళ్లారని తెలిపారు. విచారణ జరిపించి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు ప్రేమకుమార్, హరి, దానియేల్ తదితరులు ఉన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ఎమ్మిగనూరు టౌన్/ఎమ్మిగనూరురూరల్: ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం పేదలకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్ల స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.4లక్షలు మంజూరు చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి జి. రంగన్న, సీనియర్ నాయకుడు భాస్కర్, పట్టణ సహాయ కార్యదర్శి సమీవుల్లా డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో నాయకులు, మహిళలతో కలిసి మైనార్టీ కాలనీ నుంచి ఎద్దుల మార్కెట్ సమీపంలో ఉన్న 18వార్డు సచివాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. అనంతరం సచివాలయ సిబ్బందికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు విజయేంద్ర, వీరేష్, దాదావలి, కాజా, ఇస్మాయిల్, అజార్, బాషా తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

నందవరం : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మండల అధికారులతో ప్రజా సమస్య పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అర్జీలను గడువులోపు పరిష్కారించేలా చర్యలు తీసుకోవాలని వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పుల్లయ్య, సర్వే డీటీ మహేష్, ఆయా శాఖ అధికారులు పాల్గొన్నారు.

కోచింగ్ సెంటర్‌ను సీజ్ చేయాలి

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న టాపర్ కోచింగ్ సెంటర్‌ను సీజ్ చేయాలని ఏబీవీపీ నాయకుడు మారుతి డిమాండ్ చేశారు. సోమవారం ఆదోనిలో జరిగిన గ్రీవెన్స్‌లో సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌కు వినతి అందజేశారు. ఆయన మాట్లాడుతూ టాపర్ కోచింగ్ సెంటర్‌కు ఎటువంటి అనుమతులు లేవని, నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల నుంచి వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నారని చెప్పారు.

రమణీయం.. లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం



శ్రీ లక్ష్మీ నరసింహస్వామి రథోత్సవం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని మసీదపురం గ్రామంలో సోమవారం సాయంత్రం లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. దేవాలయంలో ఉదయం నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం హనుమప్పనాయుడు ఇంటి నుంచి స్వామివారికి నైవేద్యాన్ని పూర్ణకుంభంతో తీసుకువచ్చారు. పూజరి ఈరన్న పూజలు చేసిన అనంతరం స్వామి వారి రథోత్సవం భక్తుల జయజయ హర్షధ్వన్యాల మధ్య ముందుకు సాగింది.



పూర్ణకుంభంతో వస్తున్న దృశ్యం

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



ఆదోనిలో ఆల్బెండజోల్ మాత్రలను వేస్తున్న డాక్టర్. వినోద్ కుమార్



కౌతాళంలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న నోడల్ ఆఫీసర్ రఘు

ఆదోని సెంట్రల్: మనం నివసించే పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పురపాలక కమిషనర్ కృష్ణ, డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ డా. సత్యవతి తెలిపారు. సోమవారం పురపాలక ఉన్నత పాఠశాలలో హెచ్ఎం మల్లికార్జున అధ్యక్షతన నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను విద్యార్థులకు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ సాధారణంగా పరాన్నజీవులు ఎక్కువగా అపరిశుభ్రమైన వాతవరణంలో పెరుగుతాయన్నారు. పిల్లలు మట్టిలో ఆడుకొని అలాగే భోజనం చేయడం ద్వారా కూడా వీటి బారిన పడే అవకాశం ఉందన్నారు. అందుకే ప్రతి ఒక్కరు చేతులను శుభ్రపరచుకొని భోజనం చేయాలన్నారు. కార్యక్రమంలో డా. వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను ప్రిన్సిపాల్ మురళీమోహన్ అధ్యక్షతన పంపిణీ చేశారు. ఎన్ఎస్ఎస్ అధికారి జోనాథన్ వీక్లిఫ్, మండిగిరి హెల్త్ సెంటర్ సూపర్ వైజర్ సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగు నివారణకు ఆల్బెండజోల్

నందవరం : పిల్లలలో కడపులో నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు వాడాలని ఎంపీడీఓ పుల్లయ్య, పీహెచ్‌పీ డాక్టర్ శ్రీలేఖ సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీపీ స్పెషల్ స్కూల్, అంగన్‌వాడీ కేంద్రంలో ఎంపీడీఓ, డాక్టర్ చిన్నారులకు, విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు.

నులిపురుగు నివారణకు కృషి


కౌతాళం : పిల్లల్లో నులిపురుగులు పడకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని జిల్లా నోడల్ ఆఫీసర్ రఘు సూచించారు. సోమవారం స్థానిక కౌతాళం -1 సచివాలయం పరిధిలోని కన్నడ ప్రాథమిక పాఠశాలలో డీవార్మింగ్ డే కార్యక్రమం నిర్వహించారు. పిల్లలకు ఆల్‌బెండ్‌జోల్ మాత్రలు పంపిణీ చేశారు. మెడికల్ ఆఫీసర్ పావని, సీహెచ్ఓ శంషాద్ బేగం, సూపర్ వైజర్ శ్యామల దేవి తదితరులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

గోనెగండ్ల : మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక(మెయిన్) పాఠశాలలో డాక్టర్ రుక్సానా ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ (నులిపురుగుల) మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ హైమావతి, పాఠశాల హెచ్ఎం బతకన్న తదితరులు పాల్గొన్నారు.


ఆదోని వాసికి కామధేను పురస్కారం

ఆదోని అర్బన్: పట్టణానికి చెందిన గరుడాద్రి దత్తాత్రేయశర్మకు కామధేను పురస్కారం లభించింది. నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట లలితా పరమేశ్వరి పీఠంలో సోమవారం లలితా భరద్వాజ దత్త పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ రామాయణం మహేశ్వరస్వామి వారి ఆధ్వర్యంలో కామధేను పురస్కారాల కార్యక్రమం జరిగింది.



కామధేను పురస్కారంతో సన్మానిస్తున్న దృశ్యం

గొడవలు మాని ఆనందంగా జీవించండి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

పెద్దకడబూరు : ప్రజలు గొడవలు మాని కుటుంబసభ్యులతో సంతోషంగా జీవించాలని డీఎస్పీ ఉపేంద్రబాబు సూచించారు. మండల పరిధిలోని హెచ్.మురవణి గ్రామాన్ని ఎస్ఐ నిరంజన్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పచ్చని పల్లెల్లో ప్రజలు ప్రశాంతంగా ఉండాలన్నారు. చిన్నచిన్న సమస్యలకు కొట్లాడుకోవడం, కేసులు పెట్టుకోడం ద్వారా చాలా నష్టపోతారన్నారు. గొడవలు పడి కేసులు నమోదయితే జైలుకు వెళ్లడం వల్ల కుటుంబాలు ఏవిధంగా నష్టపోతాయో వివరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శివరాముడు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్యంతో ముందడుగు వేయాలి

మంత్రాలయం : విద్యార్థి దశలో ఇంటర్మీడియెట్ కీలమని, లక్ష్యం పెట్టుకుని జీవితంలో ముందడుగు వేయాలని మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ సూచించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ రమేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. ర్యాగింగ్ జోలికి వెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు.